క్లుప్తంగా

డీఎల్‌డీఓకు ఎంపీపీ, జెడ్పీటీసీ అభినందనలు


సురేష్‌బాబును సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

సంతనూతలపాడు: ఒంగోలు డీఎల్‌డీఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబును శుక్రవారం సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ బుడంగుంట విజయ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోగస్ గ్రూపులపై విచారణ చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగుల స్వయం సహాయక గ్రూపులలో బోగస్ గ్రూపులపై విచారణ చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి నాయకులు శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పొట్లూరి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందించారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని దివ్యాంగుల స్వయం సహాయక గ్రూపుల్లో నకిలీ గ్రూపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిపై సత్వరమే విచారణ నిర్వహించి అనర్హులైన గ్రూపులను తొలగించాలన్నారు. దివ్యాంగులకు రుణాలివ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయని, బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కే కాలేషా, ఎం.సులోచనారాణి, మందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంటనూ ఈ క్రాప్‌లో నమోదు చేయాలి


ఈ-పంట నమోదు గురించి వివరిస్తున్న తహసీల్దార్ శాంతి

కొత్తపట్నం: సాగుచేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని, అందుకు వీఆర్వోలు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ శాంతి ఆదేశించారు. కొత్తపట్నంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు ఖరీఫ్ 2025-26 ఈ పంట అజమాయిషీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు అధ్యక్షత వహించగా, తహసీల్దార్ మాట్లాడుతూ ఈ పంట నమోదు విషయంలో వ్యవసాయ శాఖాధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేస్తేనే ప్రభుత్వం నుంచి రైతులు రాయితీలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో అజయ్‌కుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు నిర్వాహకుల ఘర్షణ

ఒంగోలు టౌన్: నగరంలో ఇద్దరు మెడికల్ షాపు నిర్వాహకులు మధ్య ఘర్షణ జరగడం వ్యాపార వర్గాల్లో కలకలం రేగింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కూరపాటి సత్యనారాయణ స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో నాంచారమ్మ మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. అదే ప్రాంతంలో రోడ్డుకు అవతల వేమూరి సుబ్బారావు వేమూరి మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. గత కొద్ది రోజులుగా నగరంలో ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రిటైల్ మెడికల్ షాపు అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరించే సుబ్బారావు తనకు వ్యతిరేకంగా ఔషధ నియంత్రణ అధికారులకు సమాచారం ఇస్తున్నట్లు అనుమానం పెంచుకున్నాడు. దీంతో సుబ్బారావు మీద మనసులో కక్ష పెంచుకొన్నాడు. గురువారం సాయంత్రం మంగమూరు రోడ్డులో టీ తాగుతున్న సుబ్బారావు మీద సత్యనారాయణ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరీ రూపంలో జ్వాలాముఖి అమ్మవారు



ఒంగోలు మెట్రో: స్థానిక పెళ్లూరులోని శ్రీ గురునాథేశ్వర స్వామి సమేత జ్వాలాముఖి అనుగ్రహ శక్తిపీఠంలో అమ్మవారిని శుక్రవారం శాకాంబరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థాన ఆవరణతో పాటు అంతరాలయాన్ని, గర్భాలయాన్ని జ్వాలాముఖి మూలమూర్తిని, ఉత్సవమూర్తిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో చక్కగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మద్దిపాడులో మాట్లాడుతున్న డాక్టర్ ఆనందమోహన్, వైద్యశాఖ అధికారులు


డీఎస్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి

అధిక జనాభాతో అనర్థాలు

ఒంగోలు సిటీ: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ.కళ్యాణి అధ్యక్షత వహించి మాట్లాడారు. జనాభా పెరుగుదల వలన ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్ కాలేజీలో...

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు డైట్ కాలేజీలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు అధ్యక్షత వహించారు. 1987 సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా 500 కోట్లకు దాటిన సందర్భంగా ఆ రోజును ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించారని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించగా, గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులుగా రూ.1500, రూ.1000, రూ.500 అందజేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ బి.తిరుపతయ్య, అధ్యాపకులు మార్కండేయులు, రమేష్‌బాబు, వి.శ్రీనివాసరావు, మల్లికార్జున, ఎం.శ్రీనివాసరావు, పీఎల్ఎస్ ప్రసూన, భార్గవి, నాగకుమారి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఛాత్రోపాధ్యాయులు, డైట్ సిబ్బంది పాల్గొన్నారు.


మైనంపాడు డైట్ కాలేజీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు

మద్దిపాడులో ర్యాలీ..

మద్దిపాడు: అధిక జనాభాతో రానున్న రోజుల్లో అనేక అనర్థాలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జానాభా దినోత్సవం సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రపంచంలో జనాభా పెరుగుదల వలన ఎదుర్కోవాల్సిన ఇబ్బందులపై ఆయన కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు లలితమ్మ, రజితకుమారి, హెచ్‌వీలు సీతమ్మ, నాగరాజి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజు, దరియా, శ్రీను, ఆస్పత్రి సిబ్బంది, హౌస్ సర్జన్‌లు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

నాగులుప్పలపాడు: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబోలు బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులను ఆయన పరిశీలించారు. వంటగది, భోజనశాల, తదితర గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం వండే సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. వసతి గృహాల్లో సౌకర్యాలపై నేరుగా విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


భోజనశాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

17న కారంచేడు నరమేధ స్మారక సభలు

ఒంగోలు వన్‌టౌన్: కారంచేడు నరమేధ స్మారక సభలను ఈ నెల 17న చీరాలలో నిర్వహించనున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగేంద్రరావు తెలిపారు. ఒంగోలులోని ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1985 జూలై 17న కారంచేడు మాదిగలపై అగ్రకుల భూస్వాములు దాడులు చేసి మారణకాండ నిర్వహించారన్నారు. ఈ సంఘటనకు 40 సంవత్సరాలన్నారు. అప్పటి టీడీపీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వియ్యంకుడైన దగ్గుబాటి చెంచురామయ్య స్వగ్రామంలో జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్త ఉద్యమంగా మారిందన్నారు. చీరాలలోని 18 మాలపేటలు మాదిగలను అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పించాయన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం దళిత నాయకులను నాసా చట్టం కింద అరెస్టు చేయించిందన్నారు. ఈ సంఘటనకు బాధ్యుడిగా దగ్గుబాటి చెంచురామయ్యను పీపుల్స్ వార్ నక్సలైట్లు ఆయన ఇంట్లోనే కాల్చి చంపారన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం మాదిగలకు న్యాయం చేయకుండా కోర్టులను మార్చుతూ కాలయాపన చేసిందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 17న చీరాల విజయనగర్ కాలనీలో జరిగే కార్యక్రమాన్ని మాల, మాదిగలు జయప్రదం చేయాలని కోరారు.

హైరిస్క్ వ్యక్తులకు హెపటైటిస్ బీ పరీక్షలు అవసరం

నాగులుప్పలపాడు: ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే వ్యక్తులు హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు చేయుంచుకోవడం చాలా ముఖ్యమని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ సూచించారు. గురువారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా వైద్యారోగ్యశాఖ, బాపట్ల జిల్లా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిశ, ఆంధ్రప్రదేశ్ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలం బీ నిడమానూరు గ్రామంలో హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ డీసీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీతో పాటు ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లను అరికట్టడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని తెలిపారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఏఎన్ఎం జె.రాధమ్మ ఆ సంస్థ ఎంపిక చేసిన స్త్రీలకు హెపటైటిస్ పరీక్షలు నిర్వహించారు. అందులో నెగటివ్ వచ్చిన వారికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్, మందులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అవుట్ రిచ్ వర్కర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.


హెపటైటిస్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిమ్మ చీకట్లో ఎస్సీకాలనీ

- వీధి దీపాలు వెలగక ప్రజలకు ఇబ్బందులు


వీధిదీపాలు వెలగక చీకట్లో ఉన్న ఇలపావులూరు ఎస్సీకాలనీ

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరు గ్రామ పరిధిలో గల ఎస్సీకాలనీలో కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీలలో నిధుల లేమి కారణంగా అభివృద్ధి కుంటుపడింది. విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుడిపై భారం పెంచడం మినహా ప్రజలకు కనీస వసతులు కూడా కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ పట్టించుకునేవారు లేకుండా పోయారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు పరిష్కారం చూపించి చిమ్మచీకటి నుంచి తమకు విముక్తి కల్పించాలని ఇలపావులూరు ఎస్సీకాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

- అమెరికా నుంచి వచ్చిన నిరియోగియా హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

కొత్తపట్నం: మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను అమెరికా నుంచి వచ్చిన నిరియోగియా హెల్త్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు వచ్చిన నిరియోగియా హెల్త్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు.. ముందుగా వనరుల కేంద్రంలో ఎన్‌పీఎం షాపును సందర్శించారు. పురిణి మల్లేశ్వరమ్మ పంట పొలాలు, వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగించే కషాయాలు, ద్రావణాల తయారీ విధానాలు, వాటి ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సహజ వ్యవసాయం చేయడంలో ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈతముక్కల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నపిల్లలతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెయ్యి రోజుల బెనిఫిషరీష్ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సంబంధిత వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శన ద్వారా ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యం, పోషణ అనే అంశాలలో సమగ్ర అవగాహన ఏర్పడినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రైతులు, మహిళా సంఘాలు, బాలింతలు ఇలా సమాజం మొత్తానికి లాభపడే ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఇంకా ఎక్కువ శ్రద్ధ పెట్టాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ రాజీవ్, డాక్టర్ రోహిణి గంజో, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, నరసింహులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న అమెరికా సంస్థ ప్రతినిధులు

నిజాయితీగా మంచి జీవనం గడపాలి


సాహిత్య వేత్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్థానిక అంజయ్య రోడ్డులోని ఏకేవీకే కళాశాలలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దండు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువుల సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువులు మనకు జ్ఞానాన్ని చదువు రూపంలో, వృత్తిపరంగా అందజేశారని తెలిపారు. సమాజంలో బతకడానికి అవసరమైన విషయాలను తెలియజేస్తున్నారన్నారు. మనం ఎప్పటికీ గురువుల పట్ల వినయం విధేయతలతో ఉండి నిజాయితీగా మంచి జీవనం గడపాలన్నారు. కళా రంగంలో రాష్ట్ర స్థాయిలో బహుమతులు గెలుచుకున్న మిడసల మల్లికార్జునరావు, కనుమల రాఘవులు, సాహిత్య రంగంలో తెలుగు విశిష్ట సేవా పురస్కారం పొందిన కుర్రా ప్రసాద్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో పి.లక్ష్మణ్, మాకినేని అమరసింహం, జే రమాదేవి, కాటా రాధ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు డేగ కన్నులా డ్రోన్ కెమెరాలు


ఎస్పీకి డ్రోన్ కెమెరా అందిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

ఒంగోలు టౌన్: డ్రోన్ కెమెరాలతో నేర నియంత్రణ సులువవుతుందని, పోలీసులకు డేగ కన్నులా డ్రోన్ కెమెరాలు పనిచేస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శ్రీ ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు శుక్రవారం పోలీసు శాఖకు డ్రోన్ కెమెరాను బహూకరించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పోలీసు శాఖకు డ్రోన్‌ను బహూకరించడం అభినందనీయమన్నారు. జూదం, బహిరంగ మద్యపానంను పసిగట్టి తగిన చర్యలు తీసుకోవాడానికి డ్రోన్ సాంకేతికత ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు తాలూకా సీఐ విజయ కృష్ణ, నల్లూరి సీతారామాంజనేయులు, నల్లూరి జయప్రకాష్ నారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన నాయకులు


సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డితో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు పలువురు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పడుతున్న ఇబ్బందుల గురించి వారికి వివరించారు. ఈ నెల 9వ తేదీ ఒంగోలులో జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంపై వచ్చిన స్పందనను వారికి వివరించారు. కలిసిన వారిలో పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు బెజవాడ రాము, దుంపా యల్లమందారెడ్డి ఉన్నారు.

బూచేపల్లి, బైరెడ్డికి ఘన స్వాగతం


బూచేపల్లి, బైరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి శుక్రవారం ఒంగోలు బైపాస్‌లోని ఫ్లై ఓవర్ వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం కార్లతో ర్యాలీగా కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి వెళ్లారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, సంతనూతలపాడు యూత్ ప్రెసిడెంట్ అన్వేష్, కనిగిరి యూత్ ప్రెసిడెంట్ రాజశేఖరరెడ్డి, నాయకులు వెంకటాద్రి, భరత్, రవీంద్ర, మహానంది, గాయం శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం

మద్దిపాడు: మండలంలోని 47 మంది బూత్‌లెవల్ ఆఫీసర్లకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఈఆర్‌ఓ వరకుమార్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఆదిలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఎన్నికలలో కీలకమైన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. మరణించిన వారి ఓట్లు తొలగించడం, బయటి ప్రాంతాలకు వెళ్లి నివాసం ఉంటున్న వారి ఓట్లను బదిలీ చేయడం వంటి పనులు ఎలా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో బ్యాచ్‌కు 50 మంది చొప్పున 8, 9, 10, 11, 15, 16 తేదీల్లో ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎన్నికల ఉప తహసీల్దార్ పి.అరుణ, ట్రైనింగ్ బీఎల్‌ఓ నాగచంద్రబాబు, నాలుగు మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలతో ఈఆర్‌ఓ, తహసీల్దార్

ఏఎస్సైకి ఆర్ఎస్సైగా పదోన్నతి

ఒంగోలు టౌన్: ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా విధులు నిర్వర్తిస్తున్న వి.తిరుపతిస్వామికి ఆర్ఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన తిరుపతిస్వామిని ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో పదోన్నతి అనేది మరింత బాధ్యత పెంచుతుందన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించడం ద్వారా పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ రిజర్వ్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, నిబద్ధతగా వ్యవహరించి ప్రజల నమ్మకాన్ని సంపాదించాలని ఎస్పీ సూచించారు.


ఎస్పీ దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తిరుపతిస్వామి

రాజ్యాంగమే దేశ ప్రజలకు ధర్మశాస్త్రం

ఒంగోలు టౌన్: రాజ్యాంగమే దేశ ప్రజలకు ధర్మశాస్త్రమని, భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ విధిగా అంగీకరించాల్సిందేనని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు చెప్పారు. స్థానిక ఎంసీపీఏ భవన్‌లో శుక్రవారం ప్రకాశం జిల్లా అబివృద్ధి వేదిక, ఓపీడీఆర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ ప్రజలంతా రాజ్యాంగం గురించి సమగ్రంగా అవగాహన కల్పించుకున్నప్పుడే పాలకులు దిగి వస్తారని చెప్పారు. నేటి ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా దేశ సంపదను కొద్ది మందికి దోచిపెడుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగంపై ఆసక్తిని పెంపొందించడానికి ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు నగరంలోని దేముడి చెరువు వద్ద ఎంసీపీఏ భవన్లో 'భారత రాజ్యాంగం కనీస అవగాహన' అనే అంశం మీద వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. సమావేశంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ దళిత వెంకటేశ్వర్లు, మురహరిరావు, శ్రీనివాసరావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వక్తృత్వ పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు